అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 25 జూన్ 2023

రాస్పెల్లి పాఠశాలలో నో బ్యాగ్ డే

కాగజ్‌నగర్‌రూరల్ : నో బ్యాగ్ డేలో భాగంగా రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మడావి హన్మంతు మాట్లాడుతూ దేశ ఎన్నికల విధానం పిల్లలకు వివరించడానికి ఒక చక్కని సాధనం మాక్ ఓటింగ్ అని, విద్యార్థి దశ నుండే ఓటు విలువ తెలుసుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగి, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగమయ్యే విధంగా ఈ మాక్ పోలింగ్ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా దెబ్బటి సత్యనారాయణ వ్యవహరించగా ఉపాధ్యాయులు రాకేష్, ఇందారపు ప్రకాష్, దివ్యశ్రీ, గాయత్రి, జుట్టు మహిపాల్ పాల్గొన్నారు.





వివరాలు మెయిన్‌లో..



బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు తప్పిన ప్రమాదం

అనుమానాస్పదంగా మహిళ మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ధనోర-బి గ్రామ శివారులో బావిలో మహిళ మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేష్‌గిర్ సుధాకర్ చేనులో పని చేయడానికి శనివారం కూలీలు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం కోసం చేనులోని బావి వద్దకు వెళ్లారు. పరిసర ప్రాంతంలో కంపు వాసన రావడంతో బావిలో చూశారు. మహిళ మృతదేహం కనిపించింది. దీంతో ఈ విషయాన్ని రైతుకు తెలిపారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సునీల్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. శవ పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహిళ ధనోర-బికు చెందిందిగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బతుకుదెరువు కోసం ఈమె చాలా క్రితం బోథ్ మండలంలో నివసిస్తోంది. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చేది. నాలుగు రోజుల క్రితం ధనోరలో కనిపించింది. సుమారు 30 నుంచి 35 ఏండ్ల లోపు వయస్సున్న మహిళపై లైంగికదాడి చేసి బావిలో పడేసినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు పేర్కొంటున్నారు.

పీవీటీజీ రైతులకు కూరగాయల సాగుపై శిక్షణ

నవతెలంగాణ-ఉట్నూర్

పీవీటీజీ రైతులు వాణిజ్య పంటల వైపు కాకుండా కూరగాయల సాగు చేసే విధంగా ఉద్యానవన నర్సరీలో శనివారం అవగాహన కల్పించారు. పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్, హార్టికల్చర్ అధికారి సందీప్ కుమార్ మాట్లాడుతూ రైతులు వాణిజ్య పంటలు వేసి నష్టపోకుండా కూరగాయలు సాగు చేసి లాభాలు పొందవచ్చని సూచించారు. తక్కువ కాలంలో ఎక్కువ లాభం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. అంతర పంటగా కూరగాయలను సాగు చేయచ్చని పేర్కొన్నారు. అనంతరం నర్సరీలో పెంచుతున్న మొక్కలపై వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అదనపు డీఆర్డీఓ గోవింద్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-బోథ్

ఇటీవల తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ధన్నూర్(బి) ప్రధానోపాధ్యాయులు సురేష్ వైద్యను శనివారం బీఆర్ఎస్ అధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ సురేందర్ యాదవ్, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు తాహేర్ బిన్ సలాం, కన్వీనర్ నారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి, ఎల్క రాజు, గ్రంథాలయ డైరెక్టర్ రమణగౌడ్, నాయకులు సోలంకి సత్యనారాయణ, బుచ్చన్న పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-బోథ్

గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పరుపులపల్లి సర్పంచ్ జగ్నక్ మారుతి గ్రామస్తులతో కలిసి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్ పటేల్, జుగ్నక్ రావుడు, ధర్మన్న, దేవ్‌రావు, సుంగు, కాశీరాం, మారుతి, జంగు, గంగారాం పాల్గొన్నారు.

విద్యార్థులను వసతి గృహాలకు పంపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

విద్యార్థులను వెంటనే వసతి గృహాలకు పంపించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ సాంబశివరావు అన్నారు. శనివారం పట్టణంలోని కేఆర్కే కాలనీ, బంగారుగూడ, రణదివెనగర్, క్రాంతినగర్‌లో పర్యటిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాల కార్మికుల, బాల్య వివాహాల నిర్మూలన సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను ఎవరు కూడా పనిలో పెట్టుకోవద్దని, వాళ్ళ హక్కులను కాపాడాలని కోరారు. పిల్లలందరినీ పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సంజీవ సిందే, జిల్లా ప్రచార జిల్లా కార్యదర్శి దత్తు, దీపక్ పాల్గొన్నారు.

సోయాబీన్ విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

మండలంలోని కచ్‌కంటి గ్రామంలో శనివారం డీఎస్‌బీ-21 రకం సోయాబీన్ విత్తన మినీ కిట్ 8కేజీల బ్యాగులను జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య రైతులకు ఉచితంగా అందజేశారు. రైతులు సోయాబీన్ విత్తన మినీ కిట్‌ను ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కచ్‌కంటి సర్పంచ్ కుర్ర లక్ష్మి శ్రీనివాస్, డీఎస్ఓ శివకుమార్, మండల వ్యవసాయ అధికారి అశ్రఫ్ అహ్మద్, ఏఈఓ నరేష్ పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని మేడిగూడ(ఆర్) గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకులు గడప గడపకు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు గండ్రత్ సుజాత మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుకి ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఎకరాకు రూ.15,000 రైతుబంధు ఇస్తామని, ప్రతి ఆడబిడ్డకు రూ.500 వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని, ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే కనీసం రూ.5000 పెన్షన్ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఆదిలాబాద్‌టౌన్ : ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ముదిరాజ్‌లు ఆందోళన చేపట్టారు. వీడియో జర్నలిస్టును కులంపేరుతో దూషించి దాడికి పాల్పడడాన్ని తప్పుబడుతూ శనివారం పట్టణంలోని అమరవీరుల స్థూపం ఎదుట ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. పాడి కౌశిక్‌రెడ్డి పదవీకి అనర్హుడని, తక్షణమే పదవీ నుండి బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శైలెంద్ర శివయ్య డిమాండ్ చేశారు. ఉద్యమ ద్రోహి అంటూ ఘాటుగా వ్యాఖ్యనించారు. హుజురాబాద్‌లో అమరవీరుల స్థూపాన్ని కూల్చివేయడమే కాకుండా కవరేజ్‌కు వెళ్లిన వీడియో జర్నలిస్టును కిడ్నాప్ చేసి అమానుషంగా దాడి చేశారని ఆరోపించారు. కులంపేరుతో దూషించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆలయ ప్రసాదాల తయారీ కేంద్రం తనిఖీ

బాసర: సరస్వతి దేవి ఆలయ ప్రసాదాల తయ్యారి కేంద్రాన్ని శనివారం జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ వాసు రామ్ తనిఖీ చేశారు. ప్రసాదాల తయ్యారి కేంద్రంలో లడ్డు, పులిహోర ప్రసాదాల తయ్యారికి వినియోగిస్తున్న ముడి సరుకులను పరిశీలించారు. లడ్డు తయ్యారికి వాడుతున్న నెయ్యి నాణ్యమైనదని ప్రసాదాల నాణ్యతకు కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ అందిస్తుందని ఫుడ్ ఇన్స్‌పెక్టర్ పేర్కొన్నారు.

ఆట స్థలం లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఖానాపూర్ రూరల్ : ప్రభుత్వ నిబంధనల మేరకు కనీసం ఆట స్థలం లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్ డిమాండ్ చేశారు. శనివారం ఈ సందర్భంగా ఆయన విలేకరలతో మాట్లాడారు. జిల్లా, మండల కేంద్రాల్లో ప్రయివేటు పాఠశాలలు నిబంధనలను బెకాతరు చేస్తూ నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపమే ఇలాంటి నిర్వహణకు కారణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఒకే ఒక్కరు..!

- ఉమ్మడి జిల్లాలో ఒక్కరే రెగ్యులర్ ఎంఈఓ
- పర్యవేక్షణ లేక గాడితప్పుతున్న విద్యా వ్యవస్థ
- ఎటూ న్యాయం చేయలేకపోతున్న ఇన్‌ఛార్జీలు
- 2005 నుంచి పదోన్నతులు లేక అవస్థలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెగ్యులర్ మండల విద్యాధికారులు(ఎంఈఓ) లేకుండా పోయారు. ఫలితంగా పాఠశాలల పర్యవేక్షణ లేక మండల విద్యావ్యవస్థ గాడి తప్పుతోంది. ఏండ్లుగా ఇన్‌ఛార్జీలతోనే నెట్టుకురావాల్సి వస్తోంది. సరైన పర్యవేక్షణ లేని ఫలితంగా ప్రాథమిక విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. ప్రస్తుతం ఉన్న ఎంఈఓలు అందరూ ఇన్‌ఛార్జీలే కావడం.. వారు పనిచేస్తున్న పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా ఉండటంతో అదనపు భారం కారణంగా వారు ఎటూ న్యాయం చేయలేకపోతున్నారు. ప్రభుత్వం 2005 నుంచి పదోన్నతులు చేపట్టకపోవడంతో అనేక మంది ఉన్నత స్థానాల్లోకి వెళ్లలేక ఉన్న స్థానాల్లోనే పదవీ విరమణ పొందుతున్నారు. పదోన్నతులు చేపట్టిన ప్రభుత్వ విద్యావ్యవస్థను పరిరక్షించాలని ఉపాధ్యాయ సంఘాలు అనేక ఏండ్ల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. ఫలితంగా సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షగానే మారుతోంది. ప్రభుత్వ అలసత్వం.. ప్రజాప్రతినిధుల పట్టింపు లేమితనం కారణంగా సర్కారు విద్య నిర్లక్ష్యానికి గురవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడులను బలోపేతం చేస్తామని పదేపదే చెబుతున్న ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ మాత్రం చేపట్టడం లేదు. సర్కారు బడుల్లో ప్రాథమిక విద్యను పర్యవేక్షిస్తూ పరిరక్షించే రెగ్యూలర్ మండల విద్యాధికారులు(ఎంఈఓ)లు లేకుండాపోయారు. ఉమ్మడి జిల్లాలో ఇది వరకు 52 మండలాలు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 70కి చేరింది. కానీ వీటన్నింటిలో రెగ్యూలర్ ఎంఈఓ మాత్రం కౌటాల మండల విద్యాధికారి ఒక్కరే ఉన్నారు. మిగితా అన్ని మండలాలకు ఇంఛార్జీలే కొనసాగుతున్నారు. ఆయా మండలాల్లో సీనియర్ పీజీహెచ్‌ఎంలుగా ఉన్న వారినే ఎంఈఓలుగా ఇన్‌ఛార్జీలు బాధ్యతలు అప్పగించారు. అది రెండు, మూడు మండలాలకు కలిపి ఒకరు ఇన్‌ఛార్జీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎంఈఓ చేయాల్సిన పనులతో పాటు వారు పనిచేస్తున్న పాఠశాలలో పరిపాలన చూడటంతో పాటు సబ్జెక్టు బోధనకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఒక్కరే రెండు బాధ్యతలు నిర్వర్తించడంతో అటు మండలంలో పాఠశాలల పర్యవేక్షణ చేయలేక..ఇటు పాఠశాలలకు సక్రమంగా వెళ్లలేక ఎటూ సరైన న్యాయం చేయడం లేదనే అభిప్రాయం ఉంది. మరోపక్క జిల్లాలో పీజీహెచ్‌ఎంలు సరిపడా లేకపోవడంతో అనేక పాఠశాలల్లో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లే ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది.

పర్యవేక్షణ లేక అస్తవ్యస్తం..!

ఉమ్మడి జిల్లాలో ఒక్కరు మినహాయించి మిగితా అందరూ ఇన్‌ఛార్జీ ఎంఈఓలే కావడంతో ప్రాథమిక విద్యా వ్యవస్థ పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారుతోంది. రెగ్యూలర్‌గా పాఠశాలను సందర్శించడం.. అక్కడ అమలవుతున్న బోధన తీరుతెన్నులను పరిశీలించడం.. ఉపాధ్యాయులు రెగ్యూలర్‌గా పాఠశాలకు వెళ్తున్నారా లేదా అనేది పర్యవేక్షించడం.. ఆయా పాఠశాలలకు అవసరమైన మౌళిక సదుపాయాలపై నివేదికలు రూపొందించడం తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఒక్కో ఎంఈఓకు రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలు ఉండటం.. మరోపక్క వారు పనిచేస్తున్న పాఠశాలల్లోనూ హెచ్‌ఎంలుగా కొనసాగుతుండటంతో రెండు పడవలపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. మరోపక్క కొందరు ఎంఈఓలు ఎటూ వెళ్లలేక కార్యాలయానికే పరిమితమవుతున్నారనే ఆరోపణలున్నాయి. రెగ్యూలర్ ఎంఈఓలు ఉంటే ఉపాధ్యాయుల్లోనూ కొంత భయం ఉంటుంది. చూసేవారు లేరనే కారణంగా కొందరు ఉపాధ్యాయులు బడులకు సక్రమంగా వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. చాలా మంది సమయ పాలన కూడా పాటించడం లేదని తెలుస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్య గాడితప్పుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.



ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం : ఎ.వెంకట్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ప్రభుత్వ పాఠశాలల పటిష్టత, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ప్రభుత్వ చిత్తశుద్ధి కరువైంది. రెగ్యూలర్ ఎంఈఓలను నియమించాలని అనేక సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన కనిపించడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ప్రాథమిక విద్య బలోపేతం కావడం లేదు. కేజీ టూ పీజీ విద్య అనేది కేవలం ప్రకటనలకే పరిమితమవుతోంది. సమస్యలపై చొరువ చూపే పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం ఇప్పటికైనా పదోన్నతుల ప్రక్రియ చేపట్టి రెగ్యూలర్ ఎంఈఓలను నియమించి సర్కారు విద్యను బలోపేతం చేయాలి.

ఎట్టకేలకు ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

- ఈ నెల 30న జిల్లా కేంద్రానికి రాక
- పోడు పట్టాలు పంపిణీ ప్రారంభం
- కలెక్టరేట్, డీపీఓ కార్యాలయాల ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన జిల్లాలో ఎట్టకేలకు ఖరారు అయినట్లు తెలిసింది. ఈ నెల 30న ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కేంద్రానికి వస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి పర్యటనలో పలు అభివృద్ధి పనులతో పాటు పోడు పట్టాలు పంపిణీ చేయనున్నారు.

పోడు పట్టాల పంపిణీ ప్రారంభం

ఎన్నో సంవత్సరాల నుండి గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు పంపిణీ చేస్తామని గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఆదివాసీ గిరిజనులకు జిల్లా నుండే పోడు పట్టాల పంపిణీ ప్రారంభించడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగా 30న జిల్లా కేంద్రానికి వచ్చి ఇక్కడే పట్టాల పంపిణీ ప్రారంభించనున్నారు. జిల్లాలో 15479 మంది 63వేల ఎకరాల కోసం దరఖాస్తు చేసుకోగా, అధికారుల తనిఖీ తరువాత 12400 మంది అర్హులని తేల్చారు. వీరికి 35వేల ఎకరాలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన పట్టా పాస్ బుక్కులు జిల్లా కేంద్రానికి చేరుకోగా అందులో కొన్ని తప్పులు రావడంతో రీ ప్రింటింగ్ కోసం పంపించారు.





జిల్లా కేంద్రాల్లో పలు అభివృద్ధి పనులు

ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాట డీపీఓ కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభించనున్నారు. దీంతో పాటు జిల్లాకు పలు హామీలు ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం.

చిన్నపాటి వర్షానికే నిలిచిన నీళ్లు



ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికి డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేపల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచి నడవడం కూడా ఇబ్బందిగా మారింది. శనివారం వారసంత కావడంతో చేపల మార్కెట్ ఎదురుగా నీరు నిలిచి ఉండడంతో ప్రజలు మరింత ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ ప్రాంతంలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజల కష్టాలు మరింత రెట్టింపయ్యాయి.

నీటి నిల్వలతో వ్యాధులు ప్రబలే అవకాశం

రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలకు కురుస్తున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై, చేతిపంపు ఉన్నచోట్ల నీరు నిలిచి బురదమయంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలోని గుండి గ్రామానికి వెళ్లే రహదారితో పాటు గోవిందపూర్ ప్రధాన రహదారిపై, అంకుసాపూర్‌లోని చేతిపంపు ఉన్న ప్రాంతాల్లో నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో దోమలు పెరిగి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకుని నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అంకుశపూర్‌లో గ్రామస్తులు బురద తొలగించడం ప్రజాప్రతినిధుల పని తీరుకు అద్దం పడుతోంది.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా పూర్తి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని అబ్దుల్లా చౌక్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ ఎస్ఈ సంపత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి గానూ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా సమస్య పరిష్కారం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ మాట్లాడుతూ వార్డులో నెలకొన్న లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వేసవి నుండి మొదలుకుని ఇప్పటివరకు దాదాపు ముప్పై రెండు నియంత్రికలను అమర్చారని, మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ అధికారులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగం భారిగా పెరిగిన నేపథ్యంలో అందుకు తగ్గట్లుగానే అన్ని చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఎస్ఈ సంపత్ కుమార్ మాట్లాడుతూ రూ.5 లక్షల వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎక్కడ సమస్య ఉన్నా తమను సంప్రదిస్తే ఇబ్బందిని తొలగించేలా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కోఆప్షన్ సభ్యులు ఎజాజ్, నాయకులు మోబిన్ పాల్గొన్నారు.

మొక్కలను రక్షించి పచ్చదనం పెంచాలి



నవతెలంగాణ - వాంకిడీ

మండలంలోని సరండి గ్రామంలో శనివారం హరితహారంలో భాగంగా గతంలో నాటిన, ప్రస్తుతం నాటుతున్న మొక్కలను జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో రోడ్డుకు ఇరువైపుల నాటుతున్న మొక్కలను పరిశీలించి మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను రక్షించే బాధ్యత సిబ్బందిపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సహకరించి మొక్కలు పెంచడం ద్వారా ఎంతో ఉపయోగపడతాయన్నారు. కాలువ గట్టుపై కూడా మొక్కలు నాటాలని సర్పంచ్, కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఇందాని, తేజాపూర్ గ్రామాల్లో చేపడుతున్న హరితహారం పనులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఓ శ్రావణ్‌కుమార్, ఏపీఎం మహేష్, సర్పంచ్ దుర్గం కమలాకర్ ఉన్నారు.

సీఆర్టీల నియామకాలు పారదర్శకంగా చేపట్టాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖలో కొనసాగుతున్న సీఆర్టీల నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి డిమాండ్ చేశారు. తమ సంఘం ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు మణెమ్మకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో 2023-24 విద్యాసంవత్సరానికిగాను నియమించ తలపెట్టిన కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్ల నియామకం పారదర్శకంగా చేపట్టాలన్నారు. గతంలో సీఆర్టిలుగా, తాత్కాలిక విధులు నిర్వహించిన వారికి నియామక విషయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గతంలో 12నెలల వేతనాలకు సంబంధించిన జీవో వచ్చినప్పటికీ ఏప్రిల్ వరకు మాత్రమే కొనసాగించడం దారుణమన్నారు. గత సంవత్సరం సెలవులకు సంబంధించిన వేతనాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఇద్దరేసి చొప్పున ఏఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. ప్యానల్ తనిఖీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు టిఏ, డిఏలు చెల్లించాలన్నారు. అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యుటిఎఫ్ నాయకులు తంగడిపల్లి రమేష్, లైసెట్టి ప్రీతి, కోట్నక్ మోహపత్‌రావ్, టోకిని హరీష్, దుర్గం తులసీరాం, బండే హరీష్ పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



ఇటీవల విడుదలైన సివిల్స్ పరీక్షా ఫలితాల్లో జిల్లాకు చెందిన మద్దెల భార్గవ్ 554వ ర్యాంకు సాధించగా శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జోగు రామన్నను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భార్గవ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యేను సైతం ఘనంగా సత్కరించారు. యువతకు ఆదర్శంగా నిలిచేలా ఉన్నతంగా ఎదగడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిపిలు మార్శెట్టి గోవర్ధన్, తుల శ్రీనివాస్, 49వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు రాఘవేంద్ర ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంపీపీ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని గోపాల్‌పేట్ గ్రామ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ గురించి ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న రాగి జావ, మధ్యాహ్న భోజన వసతులను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని అందిపుచ్చుకొని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. వీరి వెంట గ్రామ సర్పంచ్ సల్ల లింగవ్వ సాయన్న, ఎంపీటీసీ ఎస్.వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, కార్యదర్శి సాహితి, ప్రధానోధ్యాయులు శ్రీనివాస్ ఉన్నారు.

పానికి వనంలో బోర్‌వెల్ ఏర్పాటు

సారంగాపూర్ : మండలంలోని గోపాల్‌పేట్ శివారులో పానికి వనంలో నీటి సౌకర్యం కొరకు బోర్‌వెల్ పనులను డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. బోర్‌వెల్ ఏర్పాటుతో 2000 పానికి మొక్కలకు నీరందుతుందన్నారు. త్వరలో మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సరోజ, సర్పంచ్ సల్ల లింగవ్వ, ఎంపీటీసీ ఎస్.వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, ఎపిఓ లక్ష్మారెడ్డి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రఫీ, టిఎ రజిత, లక్ష్మికాంత్, ఎఫ్ఎ చంద్రకళ, గోపాల్‌పేట్ గ్రామస్తులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ పట్టణానికి స్వచ్ఛ మున్సిపల్ అభియాన్ గ్రీన్ సిటీలో భాగంగా ఉత్తమ మున్సిపల్‌గా అవార్డు రావడం మనకు ఎంతో గర్వ కారణమని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌ను వారి నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, పడకంటి సూర్యకాంత్, లోలపు శ్రీనివాస్, మదస్తు సంతోష్, పొట్టిపెల్లి విజయ్ కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన యాల్ల భీంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నల్ల నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, బత్తుల రాము, ముత్యం, నరేష్‌రెడ్డి, వంశీరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగుల హామీలను విస్మరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు శనివారం 140 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల చిన్నచూపు చూడటం సరికాదని, రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మంత్రిని కలిసిన బోథ్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని ఇచ్చోడ పట్టణ రోడ్డు సెంట్రల్ లైటింగ్ కొరకు రూ.13కోట్లు నిధులు మంజూరు కావడంతో శనివారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నిర్మల్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మంత్రిని సన్మానించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ నారాయణ సింగ్, పిప్పల్‌కోటి మాజీ సర్పంచ్ గణేష్ పాల్గొన్నారు.

ప్రయివేట్ విద్యాసంస్థలపై ఐటీ దాడులు నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీలో ఆదాయపు పన్ను శాఖ దాడులు జరిగిన తరహాలో ప్రయివేట్ విద్యా సంస్థలపైన ఐటీ దాడులు నిర్వహించాలని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా తరువాత ప్రజలు ఇప్పుడిప్పుడే ఆర్థిక ఇబ్బందుల నుంచి కోలుకుంటున్నారని తెలిపారు. ప్రజలను ప్రయివేట్ విద్యా సంస్థలు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇంతే కాకుండా సూపర్ మార్కెట్ తరహాలో స్కూల్ బ్యాగ్స్, డ్రెస్సులు, షూస్, సాక్స్, బెల్ట్స్, పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్, రబ్బరులు, ఆఖరికి పుస్తకాలకు వేసే వట్టలు కూడా రశీదు లేకుండా స్కూల్ కాలేజ్ అవరణలోనే అమ్ముతున్నారని విమర్శించారు. కుటుంబ సభ్యులు ఆన్‌లైన్ పేమెంట్ చేస్తామంటే ఒప్పుకోవటం లేదని, అలా చేస్తే ఐటీకి లెక్కలు చూపాలని, అందుకే నేరుగా డబ్బులే రశీదు లేకుండా వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇవే కాకుండా బస్ చార్జీలు ఆన్‌లైన్ పేమెంట్ కాకుండా రశీదు లేకుండా డబ్బులే వసూలు చేస్తున్నారని తెలిపారు. పేరుమోసిన విద్యా సంస్థలు సీట్లు బ్లాక్ చేసి ఎక్కువ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందుకని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి ప్రజలు నుండి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్న ప్రయివేట్ స్కూల్ కాలేజ్ మీద ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కోరారు.

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీలో ఆదాయపు పన్ను శాఖ దాడులు జరిగిన తరహాలో ప్రయివేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో దాడులు నిర్వహించాలని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా నష్టాల బాటలో మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ కోలుకుంటున్న ప్రజలను ప్రయివేట్ విద్య సంస్థలు, చట్ట పరిధిలో లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఇవే కాకుండా సూపర్ మార్కెట్ తరహాలో స్కూల్ బ్యాగ్స్, డ్రెస్సులు, షూస్, సాక్స్, బెల్ట్స్, పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్, రబ్బరులు, ఆఖరికి పుస్తకాలకు వేసే వట్టలు కూడా రశీదు లేకుండా స్కూల్ కాలేజ్ అవరణలోనే అమ్ముతున్నారని అన్నారు. ఇవే కాకుండా బస్ చార్జీలు ఆన్‌లైన్ పేమెంట్ కాకుండా రశీదు లేకుండా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆ విద్యాసంస్థల్లో తనిఖీలు చేపట్టాలని కోరారు.

కుభీర్ ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో దేవాలయ నిర్మాణానికి సహకరించిన కుభీర్ ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతాల్కర్ అరవింద్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కుభీర్ మండలంలోని రామ్‌నాయక్ తండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కుల, మత భేదాలు లేకుండా శాస్త్రీయంగా, హేతుబద్ధంగా విద్యాబోధన జరిగేలా చూడాల్సిన ఎంఈఓ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే దేవాలయ ఏర్పాటు జరిగిందని అన్నారు. దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభించిన నాటి నుండి కనీసం ఒక్కరోజు కూడా పాఠశాలను పర్యావేక్షించలేదని అన్నారు. గతంలో కూడా ఎంఈఓపై పలు ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నమత్కర్ నవీన్, ముధోల్ డివిజన్ కార్యదర్శి గడపారే పరమేష్ పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

నవతెలంగాణ-నేరడిగొండ

పేదలకు మండల కేంద్రంలోని కాలోనికి అనుకోని ఉన్న ప్రభుత్వ భూమిలోని ప్లాట్లను అర్హులైన నిరుపేద ప్రజలకు ఇవ్వాలని లీడ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ పవన్‌చంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సద్దాం, సయ్యద్ సబీర్, సయ్యద్ నసీర్, అర్షద్, అఖిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలం కేంద్రానికి చెందిన పోతరాజు లింగన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శనివారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ విదేశంలో ప్రమాదవశాత్తు మరణించారు. విషయం తెలుసుకున్న ఆయన వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శ్రీహరి రావు వెంట పార్పెల్లి మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, అట్ల రాంరెడ్డి, ఈటల శ్రీనివాస్, నిర్మల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పోడెల్లి గణేష్ ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి పూజారి నియామకం

నవతెలంగాణ-బోథ్

గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక సాయినగర్ కాలనీలో అభయాంజనేయస్వామి ఆలయానికి పూజారిని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ సురేందర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లడుతూ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు చొరవ దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో అభయాంజనేయస్వామి ఆలయంలో అనునిత్యం పూజలు నిర్వహించడానికి ప్రభుత్వం ద్వారా పూజారిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే గ్రామస్తులు ఎమ్మెల్యేకి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బోథ్ సర్పంచ్ నూతనంగా నియమించబడ్డ పూజారిని శాలువాతో సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల పట్ల అభివృద్ధి లక్ష్యంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు గట్ల గంగాధర్, నాయకులు గోవర్ధన్, రాజు, ఇస్తారి, గంగామల్లు, రాజేశ్వర్, నాయకులు రమణ, చిన్నయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సమ్మె సన్నాహక సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు 11వ పీఆర్సీని వర్తింపజేయాలని అన్నారు. కార్మికులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం మెమో నెంబర్ 48ని తీసుకువచ్చి పాఠశాలలను ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని, అదనపు పని చేయిస్తోందని అన్నారు. జీఓ నెంబర్ 51 తీసుకువచ్చి కార్మికుల పని భద్రతను దూరం చేసి మల్టీపర్పస్ వర్కర్స్‌గా మార్చేసి పని భారాన్ని పెంచిందని అన్నారు. కార్మికులకు రూ.2లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని సీఎం హామీనిచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. వచ్చే వేతనాలు కుటుంబ పోషణకు సరిపోక గ్రామపంచాయతీ కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలను చెల్లించాలని పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్, సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద భీమా రూ.10 లక్షల చెల్లించాలని అన్నారు. అలాగే 60 సంవత్సరాలు నిండిన వారికి రూ.5లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్నమని అన్నారు. కార్మిక సంఘాలను కలుపుకొని జూలై 6వ తేదీ నుంచి గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తారని తెలిపారు. ఈ లోపు రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్ పరిష్కారం కోసం చొరవ చూపాలని హెచ్చరించారు. ఈ సదస్సులో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొజ్జ ఆశన్న, నాయకులు అడెల్లు, శంకర్, రాజేశ్వర్, వెంకట్‌రావు, సోనేరావు, రామక్క, రవి, కిరణ్, విలాస్ పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం.. చదును పనులకు శ్రీకారం..

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలో రెండు రోజుల కింద కురిసిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. మొన్నటి వరకు ఎండల తీవ్రతకు పనులు చేసుకునే పరిస్థితి లేక ఇబ్బంది పడ్డ రైతులు ఇప్పుడు నేల చదును పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు తమ పొలాల్లో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేసుకుంటున్నారు. కమతాలకు హద్దుగా పెట్టుకున్న కంచెను సరిచేసుకుంటూ, కొత్తగా అమర్చుకుంటున్నారు. మండలంలో కొందరు రైతులు వర్షాధారంగా పత్తి పంటను వేసుకుంటారు. అలాగే చెరువులు, కుంటల ఆధారంగా పసుపు, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటల సాగు చేస్తారు. నీటిపారుదల అధికంగా ఉండే సదర్‌మాట్ ఆయకట్టులో అధికశాతం రైతులు వరిపంట వేసుకుంటారు. ఈపాటికే నేల చదును చేసుకున్న మండలంలోని సుర్జాపూర్, మేడంపల్లి, రాజూరా, సింగాపూర్ తదితర గ్రామాల్లోని పలువురు రైతులు పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు. పసుపు సాగుచేసే కొంతమంది రైతులు చదును పనుల్లో బిజీగా ఉన్నారు. పత్తి, పసుపు మొక్కజొన్న పూర్తిస్థాయిలో విత్తుకోవడానికి పది రోజుల సమయం పడుతుందని రైతులు తెలిపారు. బావులు, బోరుబావులు చెరువుల్లో నీరు చేరితేనే వరినారు మళ్లను తయారు చేసుకోవచ్చని అప్పటి దాకా వేచి చూడాల్సిందేనని రైతులు పేర్కొంటున్నారు.



కలెక్టరేట్ ఎదుట అనాథల అరిగోస దీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కేసీఆర్ అనాథ పిల్లలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట శనివారం ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనాథ పిల్లలతో కలిసి "అనాథల అరిగోస దీక్ష చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనాథలకు అనేక హామీలు ఇచ్చి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్న ఏ ఒక్క హామీని కూడా ఇప్పటివరకు నెరవేర్చలేదని అన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులు లేని అత్యంత నిస్సహాయులైన అనాథలను సైతం కేసీఆర్ సర్కార్ మోసం చేసిందన్నారు. అనాథలకు ప్రభుత్వమే అమ్మానాన్న అని, వారికి గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తామని, స్మార్ట్ కార్డులు ఇస్తామని, ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీలిచ్చి విస్మరించారని అన్నారు. కేసీఆర్ తక్షణమే స్పందించి న్యాయబద్ధమైన డిమాండ్లు అన్నింటినీ నెరవేర్చాలని అన్నారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ పాలెపు గణేష్, సీనియర్ నాయకులు ఆరెపల్లి గణేష్, జిల్లా నాయకులు చిట్టి రవి, రోడ్డ రాజశేఖర్, సురేష్, సునీల్, మాకునూరు విజయ్, ఎంఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ పసుల శ్రీకాంత్, అనాథ పిల్లలు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్‌పై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ జిల్లా యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని పిట్లలవాడలో యువజన కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శి ఇలియాస్ ఖాన్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ ఖాన్‌లతో కలిసి ప్రధానంగా యువకులకు రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కంపిటేషన్ గురించి వివరించారు. జూలై 2న నిర్వహించే రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కంపిటేషన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ చరిత్ర గురించి, 60 నిమిషాలు ఆన్‌లైన్‌లో ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. మెజారిటీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులు ఇవ్వడం జరుగుతుందని అలాగే నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన యువతులకు, ఎలక్ట్రిక్ స్కూటీ ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని యువతీ, యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



అనుమతి లేని చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

అనుమతిలేని కార్పొరేట్ శ్రీచైతన్య స్కూల్‌పై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగరి వెంకటేష్ అన్నారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో స్కూల్ ముందు ధర్నా, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శ్రీ చైతన్య కార్పొరేట్ స్కూల్ గత రెండు సంవత్సరాల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది ఫీజులు వసూలు చేస్తూ, అధికారులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. ఎనిమిదవ తరగతి వరకు అనుమతి ఉంటే, పది వరకు స్కూల్ నడుపుతున్నారని ఆరోపించారు. ఒక ప్రయివేటు భవనాన్ని అద్దెకు తీసుకొని రెండు చోట్ల స్కూల్ నడుపుతూ, కనీస సౌకర్యాలు విద్యార్థులకు అందించడం లేదన్నారు. పలుమార్లు విద్యాశాఖ అధికారులకు విన్నవించిన పట్టించుకున్న పాపనా పోలేదని విమర్శించారు. ఇప్పటికైనా శ్రీ చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి జవహారే రాహుల్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు దిగంబర్, జగన్, ధనరాజ్, లక్ష్మణ్, నవప్రసాద్, తేజ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీసులకు సహకరించాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్, శివాజీ చౌక్, జయ శంకర్ సర్కిల్, మయూరి హోటల్, ఈద్‌గాం ప్రాంతాల్లో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ టైమార్స్ మిషన్స్ ఏర్పాటు పనులను మున్సిపల్ చైర్మెన్‌తో కలిసి ట్రాఫిక్ ఎస్సై రావుల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత జనాభాతో పాటు వాహనాలు పెరిగాయని అన్నారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమనిబంధనాలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కేటాయించిన టైమింగ్ పూర్తి అయ్యి, సిగ్నల్ సూచన వచ్చాకే రోడ్ క్రాస్ చేయాలని, తొందర పాటుగా సిగ్నల్స్ జంప్ చేయటం సరికాదని, ప్రమాదాలను మనమే కొని తెచ్చుకున్నవాళ్లమవుతామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్స్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుద్ఘాతానికి గురై వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

విద్యుద్ఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పోల్లుగూడలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరెంగా లక్కు(40) విద్యుద్ఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర నుంచి తన చేనులో వెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ అనుకొని ఉన్న డీటీఆర్ వద్ద కరెంట్ షాక్ తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. గ్రామస్తులు ఆస్పత్రికి తీసుకొని వెళ్ళే లోపే అప్పటికే ఆయన మరణించినట్లు తెలిపారు. మృతుడికి భార్య లింగుబాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరేసుకొని రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-సారంగాపూర్

ఉరేసుకొని రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ప్యారమూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్యారమూర్‌కు చెందిన చందాల నడ్పి సాయన్న (53) తనకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పు చేసి నూతనంగా ఇల్లు కట్టుకున్నడు ఇద్దరు కుమారులు బతుకుదెరువుకు గల్ఫ్ దేశాలకు వెళ్లారు. దీంతో అప్పు ఎక్కువై వాటిని ఎలా తీర్చాలని మనస్థాపానికి గురై శనివారం తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని బార్య పోసాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

నవతెలంగాణ-నార్నూర్

ప్రయివేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత సదుపాయాలు కల్పిస్తు విద్యాబోధన జరుగుతుందని, నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్ ఇన్‌చార్జీ బాలాజీ కాంబ్లే అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్‌లో ప్రవేశం పొందాలని అన్నారు. శనివారం ఎంపల్లి తండాలో పదో తరగతి పాసైన విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. తండాతో పాటు వ్యవసాయ క్షేత్రంలో పోషకులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందటకు తగు సూచనలు చేశారు. ప్రభుత్వ కళాశాలలో ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా ప్రవేశాలు పొందవచ్చునీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్ కూడా అందిస్తుందనీ పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవం గల అధ్యాపకులతో నాణ్యమైన విద్యబోధన బోధిస్తారని అన్నారు. అందుకని విద్యార్థులు పోషకులు ఆలోచించి, ప్రయివేట్ యాజమాన్యానికి డబ్బులు పెట్టకుండా, ప్రభుత్వ కళాశాలలో చేరీ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. వారి వెంట కళాశాల సిబ్బంది ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-బాసర

మండల పరిధిలోని మైలాపూర్, శారదానగర్, రవీంద్రపూర్‌లో శనివారం క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ లాలయ్య మాట్లాడుతూ రెండు వారాలు జ్వరం రావడం, దగ్గినపడు తేమడ పడటం, సాయంత్రం వేళ జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం క్షయ వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ వ్యాధి ఉన్న వారికి ప్రతినెలా రూ.5వందలు వారి అకౌంట్‌లో జమ చేయడం, ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫాహిం ఉన్నిస, ఏఎన్ఎం లక్ష్మీ, ఆశ కార్యకర్తలు కవిత, రాణి, లక్ష్మీ, పాల్గొన్నారు.

ఇంటింటికి బీజేపీ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 9 సంవత్సరాల పరిపాలనపై మహాజన సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా లక్ష్మణచాంద మండల కేంద్రంలో శనివారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమలు గురించి ఇంటింటికి వివరించారు. మోదీ హయాంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా సంక్షేమమే ప్రధాన ఎజెండాగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని మండల బీజేపీ ఉపాధ్యక్షులు రంజిత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గుడ్ల రంజిత్, ప్రధాన కార్యదర్శి అల్లూరి రాజు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీ రాజేశ్వర్, ఎర్ర పోతన్న, బక్కోళ్ల చిన్న రాజన్న, బొజ్జ రాములు, కూన లింగన్న, రవి, ప్రశాంత్, లింగన్న పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠికను తప్పుగా ప్రచురించడం సరికాదు

నవతెలంగాణ-జైనథ్

రాజ్యాంగ పీఠికను పదో తరగతి సాంఘీక శాస్త్రం పుస్తకంలో తప్పుగా ప్రచురించడం జరిగిందని, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ పీఠికలోని సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలు తొలగించి, మిగతావి రాజ్యాంగ పీఠికపై ప్రచురించడం జరిగిందని, ఇది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ, బద్దంగా ఉండాల్సిన పాఠ్యపుస్తకాల ప్రచురణలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, అవమానపరిచినట్లుగా, ఉన్నాయని తెలిపారు. వెంటనే రాజ్యాంగ పీఠికలోని సెక్యులర్, సోషలిస్టు పదాలను చేర్చి పదో తరగతి సాంఘీక పుస్తకం అందుబాటులో ఉంచాలని టీఎస్‌యూటీఎఫ్ తరపున డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా ఎస్సీఈఆర్టీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ ట్రైనింగ్ వాళ్లు ఏదైతే ఈ తప్పిదాం చేశారో అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీజేపీని ఆదరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ పార్టీని ప్రజలు ఆదరించి, అవకాశమివ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని రాంనగర్ కాలనీలో గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని, అలాగే రాష్ట్రంలో బీజేపీకి అవకాశం ఇస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు పూర్తి అవకాశాలు ఉంటాయని అన్నారు. బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తోందని అన్నారు. కానీ అదే 9ఏండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పులకుప్పగా మారిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న నియోజకవర్గ ప్రజలు నాలుగుసార్లు అవకాశం ఇచ్చారని, ఒకసారి మంత్రిని కూడా చేశారు. కమిషన్‌లకు కక్కుర్తి పడి పనులు చేయించుకున్నారని అన్నారు. రాష్ట్రంలో సుభిక్ష పాలన కావాలంటే బీజేపీకి అవకాశం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భీమ్‌సేన్, స్వామి, ధోని జ్యోతి, ముకుంద్‌రావ్, శివ, గోపీ, రాజు, పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి శనివారం తెల్లవారుజామునే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు మహారాష్ట్రకు చెందిన వాడిగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్‌లో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. మృతుడు ప్రతినిత్యం తాగుతూ ఉండేవాడని ఇంటికి కూడా వెళ్లేవాడు కాదని స్థానికులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వచ్చే ఎన్నికలలో బీజేపీకి అవకాశం ఇవ్వాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



రానున్న ఎన్నికలలో బీజేపీకి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొంగ సత్యనారాయణ కోరారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా వార్డు నెంబర్ 2లోని బూత్ నెంబర్ 92లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలను మోసపూరిత హామీలతో మభ్యపెడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోలెం వెంకటేష్, పార్టీ కోశాధికారి అరుణ్‌లోయ, నాయకులు పిర్సింగుల తిరుపతి, ఈశ్వర్‌దాస్, చేరాల శ్రీనివాస్, రణ్‌వీర్‌బిస్వాస్, గుమ్ముల సాయికృష్ణ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో రైతు మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన టాక్రె బిక్కు(35) అనే రైతు తన పంట చేనులో పనులు నిర్వహిస్తుండగా పిడుగుపడడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం పంట చేనుకు పత్తి విత్తనాలు నాటేందుకు వెళ్లాడని, మధ్యాహ్నం వర్షం కురవడంతో పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు తెలిపారు. మృతుడికి నలుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె పావని(14), పుష్ప(12), ఉమా(6), పూలేశ్వరి(4), కుమారుడు శివ(2) ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటంబపోషణ భారంగా మారిందని, ప్రభుత్వం ఆదుకోవాలని భార్య మంజుల రోదిస్తూ కోరింది.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో వివిధ గ్రూపులలో ఖాళీగా ఉన్న 25 సీట్లకు, ద్వితీయ సంవత్సరం ఎంఈసీ గ్రూపులో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 26వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సోమవారం ఉదయం 11 గంటలకు పాఠశాలకు హాజరై బోనఫైడ్, పదవ తరగతి మార్కుల జాబితా ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదవ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

6వ తరగతి ప్రవేశాల రెండవ ఎంపిక జాబితా విడుదల

6వ తరగతిలో ఖాళీగా మిగిలిన 12 సీట్లకు రెండవ ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. అదేవిధంగా ఇటీవల ఖాళీ అయిన 7వ తరగతిలో 1 సీటుకు, 8వ తరగతిలో 3సీట్లకు, 9వ తరగతిలో 2సీట్లకు ఎంపిక జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 28వ తేదీ లోపు ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఇచ్చిన గడువు లోపు హాజరు కాని విద్యార్థుల సీటు రద్దు చేయబడుతుందని తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందనున్న అధికారికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని జీఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్టుమెంట్‌లో ఈ నెలలో పదవి విరమణ పొందనున్న ఎం శరత్‌బాబు, డీవైజీఎం (ఎస్అండ్ఎ)ఐఏ బెల్లంపల్లి రీజియన్‌ను పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో జీఎం కార్యాలయ సిబ్బంది శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇంట్రనల్ ఆడిటర్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి జీకె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గంగారాం మాట్లాడుతూ సెల్ ఫోన్ వినియోగంపై లాభ, నష్టాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సైబర్ ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన వారికి ఓటీపీలు చెప్పడం, తమ సమాచారాన్ని అందించవద్దన్నారు. సమస్యలకు గురి కావద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య ఏఎస్సై బూర రవీందర్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఏవీ పాఠశాలలో 50 శాతం సీట్లు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ డీఏవీ పాఠశాలలో స్థానిక ఆదివాసీ పిల్లలకు 50 శాతం సీట్లు కేటాయించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో డీఏవీ ప్రిన్సిపాల్‌కు శనివారం వినతిపత్రం అందించారు. సీట్లలో 50 శాతంతో పాటు అడ్మిషన్ ఫీజు రూ.10000 లేకుండా ఉచితంగా అడ్మిషన్ ఇవ్వాలని, ఉద్యోగం లేని వారి పిల్లలకు సంవత్సరం ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ యూ జిల్లా అధ్యక్షుడు వెడ్మ కిషన్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కనక రాజు. నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం జంగు, రెడ్డి లక్ష్మణ్, మంగ ఎల్లయ్య, ఆడ శేఖర్, వెడ్మ శ్రీకృష్ణ పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు కుమురంభీం జిల్లా సమన్వయ కర్త బాలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం జిల్లాలో గల గురుకుల పాఠశాలలో, జూనియర్ కళాశాలలో పాఠశాల, ఇంటర్ మీడియట్ స్థాయి ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు తాత్కాలిక బోధన సిబ్బంది ఎంపిక కోసం ఈ నెల 27వ తేదీన ఆసిఫాబాద్ బాలుర గురుకుల విద్యాలయంలో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు ధృవపత్రాలు పరిశీలించి అనంతరం తరగతి బోధన నిర్వహించనున్నట్టు తెలిపారు. బాలుర గురుకుల విద్యాలయంలో ఫిజిక్స్ ఒకటి, బాలికల గురుకుల విద్యాలయంలో తెలుగు రెండు, వృక్షశాస్త్రం ఒకటి, ఈజీటీ తెలుగు ఒకటి, ఆంగ్లం మూడు, గణితశాస్త్రం రెండు, టీజీపీ హిందీ రెండు, ఆంగ్లం రెండు, గణితం, మూడు, జనరల్ సైన్స్ ఒకటి, ఫిజికల్ సైన్స్ రెండు, జూనియర్ అధ్యాపక, పీజీటీ పోస్టులకు యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పీజీ, డిగ్రీతో పాటు బీఈడీ అర్హత, టీజీపీ పోస్టుకు యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి బీఎస్సీ, బీఏ, బీకాం డిగ్రీ కనీసం 50 శాతం మార్కులతో పాటు బీఈడీ అర్హత కలిగి ఉండాలని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పూర్తి బయోడెటాతో పాటు విద్యార్హత జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని ఆయన కోరారు.

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎంజేపీ పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, సోషల్ సబ్జెక్టుల్లో అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ), బీఈడీ పూర్తి చేసి ఉండాలని, ఎంపిక విధానం డెమో మరియు ఇంటర్వ్యూ ఆధారంగా జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు దగ్గరలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలల్లో ఈ నెల 28 లోపు తమ బయోడేటాకు విద్యార్హతల జిరాక్స్ పత్రాలను జతపరచి అందజేయాలన్నారు. అభ్యర్థులకు ఈ నెల 30న ఉదయం 8:30 నుండి సాయంత్రం 4:30 వరకు గుడిపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో డెమో మరియు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 7993456620 నెంబర్‌పై సంప్రదించాలని సూచించారు.

కొత్త డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలలో ఏర్పాటు కానున్న మహాత్మా జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్టు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ గోపీచంద్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్ఈఐఎస్.తెలంగాణ.గౌ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వృత్తి పన్ను కట్ చేయడం అన్యాయం

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలో సింగరేణిలో పనిచేస్తున్న ప్రయివేటు సెక్యూరిటీ గార్డుల మే నెల జీతాల నుంచి వృత్తి పన్ను పేరుతో ఆర్ఎంజీ కాంట్రాక్టర్ మహేందర్‌గౌడ్ ప్రతీ గార్డు నుంచి రూ.300 కట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎస్ఓటు జీఎం ఉమాకాంత్‌కు వినతిపత్రం ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన వెంటనే జీఎంతో మాట్లాడి సెక్యూరిటీ గార్డులకు న్యాయం చేయగలమని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎ ఓదెలు మాట్లాడుతూ సింగరేణిలో ఎక్కడాలేని విధంగా కేవలం బెల్లంపల్లి ఏరియాలోనే ప్రయివేటు సెక్యూరిటీ గార్డుల జీతాల నుండి మాత్రమే వృత్తి పన్ను కట్ చేయడం అన్యాయమన్నారు. పర్మినెంట్ కార్మికులకు కూడా లేని వృత్తి పన్ను ప్రయివేటు సెక్యూరిటీ గార్డులకు ఎలా వర్తిస్తుందని ఓదెలు ప్రశ్నించారు. ఆర్డర్ కాపీలో కూడా సెక్యూరిటీ గార్డులు వృత్తి పన్ను చెల్లించాలని ఎక్కడా లేదన్నారు. అది కాంట్రాక్టర్‌కు సంబంధించిన విషయమన్నారు. కాబట్టి వెంటనే వృత్తి పన్ను పేరుతో కట్ చేసిన రూ.300 తిరిగి సెక్యూరిటీ గార్డుల ఖాతాలో వేయాలని, భవిష్యత్తులో ఎలాంటి కటింగ్‌లు చేయకూడదని, అలా జరిగితే సెక్యూరిటీ గార్డులు పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మేకల జాక్సన్, ఉపాధ్యక్షుడు డి.రాజశేఖర్, సహాయ కార్యదర్శి కె కేశవ్, కోశాధికారి కోట ప్రభాకర్, నాయకులు దామోధర్, మోహన్ పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగలు అరెస్ట్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఇంధన్‌పెల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో రైతులకు చెందిన వ్యవసాయ మోటర్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 5 వ్యవసాయ మోటర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా లక్షెటిపేట సీఐ కృష్ణా రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఇంధన్‌పెల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా పలువురు రైతులకు సంబంధించిన వ్యవసాయ మోటార్లు చోరీకి గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన శ్రీనివాస్ రావు, రెంకల స్వామి రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పోచంపెల్లి సతీష్, సిబ్బంది తుకారాం, ప్రభాకర్‌లు శుక్రవారం రాత్రి ఇందన్‌పెల్లి వద్ద ఉట్నూర్‌కు చెందిన గుడిపెల్లి సుధాకర్, గుడిపెల్లి భీమ్ రెడ్డిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి దాదాపు 84 వేల విలువగల 5 మోటర్లను, మోటర్లను తీసుకెళ్లడానికి ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుచుతామని తెలిపారు.

మోటార్ల దొంగలను పట్టుకోవడంలో ఛాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై సతీష్ సిబ్బంది తుకారాం, ప్రభాకర్‌లను సీఐ కృష్ణారెడ్డి అభినందించారు.

అంగన్‌వాడీల ద్వారా నాణ్యమైన సేవలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అంగన్‌వాడీల ద్వారా నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని బనార్‌గొంది గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా నాణ్యమైన సేవలు అందిస్తుందన్నారు. ఎక్కడ లేని విధంగా రక్తహీనత ఉన్నవారికి చిరుధాన్యాల ఆహారాన్ని అందిస్తుందని తెలిపారు. ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉత్తమ సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం గ్రామంలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో సందర్శించి మధ్యాహ్న భోజన వివరాలను, విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని సావిత్రి, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుజాత, ఎంపీటీసీ సావిత్రి మల్లేష్, పంచాయతీ సెక్రటరీ లావణ్య గ్రామ సర్పంచ్ గిరిజా, ఉప సర్పంచ్ బాలాజీ, బురుగుడ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, రామగౌడ్, అంగన్‌వాడీ టీచర్, గ్రామ పటేల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు లేకుండా చూడాలి

- జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

జిల్లాలో మాత శిశు మరణాలు లేకుండా చూడాలని నియంత్రణపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యాధికారులతో మాత శిశు మరణాల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మారుమూల గ్రామాలలో వర్షాకాలం కారణంగా రాకపోకలకు ఇబ్బంది ఎదురయ్యే నేపథ్యంలో ఆయా గ్రామాలలో ఉండే గర్భిణుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. హైరిస్క్ ఉన్న గర్భిణులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో రోడ్లు తగ్గిపోయి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడి బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండే గ్రామాలకు సంబంధించి ప్రతినెల 3వ శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో జరిగే సమావేశానికి సర్పంచులు, ఎంపీపీలు హాజరవుతారని, గ్రామాల వివరాలను సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మాత శిశు మరణాలు సంభవించకుండా క్రమం తప్పకుండా గర్భిణులకు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామకృష్ణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

నవతెలంగాణ-జన్నారం



దళితులపై దాడులను అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శి కనికరం అశోక్ అన్నారు. శనివారం మండలంలోని, కలమడుగు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం శాఖ సమావేశం ఆ గ్రామ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళితులపై రోజురోజుకు అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. వాటిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మనుధర్మ శాస్త్రాన్ని అవలంబిస్తూ ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతుందన్నారు. వీటిని తిప్పి కొట్టాలంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించి తీరాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకులు కూకటికారి బుచ్చయ్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగుర్ల లింగన్న జన్నారం మండల ఉపాధ్యక్షులు గుడ్ల రాజన్న, శ్రీపల్లి జగన్మోహన్ అంజన్న పాల్గొన్నారు.

తెగిన గుండి వాగు తాత్కాలిక వంతెన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుండి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో వాగుపై తాత్కాలిక ప్రయాణం కోసం నిర్మించిన రహదారి శుక్రవారం కురిసిన వర్షానికి వాగులో ప్రవాహం పెరగడంతో తెగిపోయింది. దీంతో గ్రామానికి వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాయకులు పదేపదే బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పినప్పటికీ పూర్తిస్థాయిలో బ్రిడ్జి అందుబాటులోకి రాకపోవడంతో గ్రామస్తుల కష్టాలు తొలగిపోవడం లేదు. ప్రస్తుతం పనులు ప్రారంభమైనప్పటికీ అనుకున్న స్థాయిలో వేగం అందుకోకపోవడంతో వర్షాకాలంలో బ్రిడ్జి పూర్తవుతుందనుకున్నప్పటికీ పనులు ఆ స్థాయిలో జరగకపోవడంతో బ్రిడ్జి అందుబాటులోకి రాలేదు. దీనితో గ్రామస్తుల కష్టాలు మళ్ళీ ప్రారంభమయ్యాయి. కొద్దిపాటి వర్షానికి తాత్కాలిక రహదారి తెగిపోవడంతో గ్రామస్తుల కష్టాలు షరామామూలుగా మారిపోయాయి. అధికారులు ప్రజాప్రతినిధుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడం మినహా గ్రామస్తులు చేసేదేమి లేకుండా పోయిందని వాపోతున్నారు.

టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీని హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ప్రకటించగా జిల్లాకు చెందిన నలుగురు నాయకులకు చోటు లభించింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పోల్కార్ సాయిరాం రెండోసారి ఎన్నిక కాగా, కెరమెరి మండలానికి చెందిన రామిల్ల మహేష్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదే మండలానికి చెందిన, చౌహాన్ పృథ్వీరాజ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన రేగుంట వేణు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ మీద నమ్మకంతో ఉంచి బాధ్యతను అప్పగించినందుకు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు, ఆదిలాబాద్ పార్లమెంటు అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపెల్లి రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినులకు సర్పంచ్ సన్మానం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సోమగూడెం న్యూ కాలనీకీ చెందిన జీదుల లక్ష్మన్-రాధీకల కుమార్తె సిరి నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి అర్హత పొందింది. అలాగే కొండ ప్రవీణ్-సుధల కుమార్తె శ్రీవల్లి పదవ తరగతిలో గ్రామంలో అందరి విద్యార్థుల కంటే 9.0 చదివి ఉత్తమ ఫలితాలను సాధించిన గ్రామ ముద్దు బిడ్డలకు శనివారం సర్పంచ్ వేముల కృష్ణ ఘనంగా సన్మానించి, స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలుపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకరు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో, ఒకరు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇంత మంచి ర్యాంకులు సాధించిన ఈ విద్యార్థినిలు గ్రామనికే గర్వకారణమని భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని తల్లి తండ్రుల పేరు, అలాగే గ్రామం పేరు నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు కొత్త రమేష్, బొల్లెపల్లి కొమురక్క, బన్న హిందుమతి, కోఆప్షన్ జీదుల కనకయ్య, పిల్లల తల్లి తండ్రులు జీదుల లక్ష్మన్-రాధీక, కొండ ప్రవీణ్-సుధ దంపతులు గ్రామస్తులు నందికొండ శ్రీధర్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

చిన్న రాష్ట్రాల ఏర్పాటు కోసం ఉద్యమించిన తెలంగాణ ఉద్యమకారులకు ఉత్తరాది రాష్ట్రాలలో ఇస్తున్న విధంగా రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని త్వరలో హైకోర్టు తీర్పు వెలువరించే అవకాశం ఉన్నట్లు 1969 తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తొలి దశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు రూ. 15 వేల పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని మార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో రిటైర్డ్ ఓయు ప్రొఫెసర్ ఎన్ స్వామి హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఆరేళ్ల తర్వాత తమకు అనుకూలంగా తీర్పు వచ్చే సమయం ఆసన్నమైందని, ఈ తీర్పు త్యాగాలు చేసిన తొలి దశ ఉద్యమకారులకు ఊరటనిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

డైట్ విద్యార్థులు జూలై 10 లోపు వార్షిక పరీక్ష ఫీజు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

డైట్ ప్రస్తుత సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వచ్చే ఆగస్టు, సెప్టెంబర్ నెలలో నిర్వహించే పరీక్షలకు గాను జూలై 10 లోపు వార్షిక పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పరీక్షలు తప్పిన వారు ప్రత్యేక చాలన్ ద్వారా ఫీజు కట్టవచ్చని రెగ్యులర్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.250 ఉంటుందని ఇతర వివరాల కోసం ఆయ కళాశాలల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఇతర వివరాల కోసం బీఎస్ఈ.తెలంగాణ.ఇన్ వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

నవతెలంగాణ-నస్పూర్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని శ్రీరాంపూర్ ఏరియా ఉపరితల గని కాలరీ మేనేజర్ సుధీర్ జక్కులవార్ అన్నారు. స్వచ్ఛ పఖ్వాడలో భాగంగా శ్రీరాంపూర్ ఉపరితల గనిలో చెత్తను తొలగించారు. అనంతరం కాలరీ మేనేజర్ మాట్లాడుతూ అందరూ స్వీయ పరిశుభ్రత పాటించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అదే విధంగా ప్రతి ఒక్క ఉద్యోగి తను ఇంటిలో, పనిచేసే ప్రదేశంలో పరిశుభ్రంగా ఉండి పరిసరాలను కాపాడుకోవాలని తెలియజేశారు. అలాగే ఓసిపి-2 పరిసర ప్రాంతమైన తాళ్లపల్లి గ్రామానికి వెళ్లి అక్కడ పాఠశాలలోని చెత్తను తొలగించారు. అంతేకాకుండా ప్లాస్టిక్ వాడకం ద్వారా జరగబోయే అనర్థాలను గురించి తెలియజేశారు. ప్లాస్టిక్ వద్దు గన్ని బ్యాగులే ముద్దు అని తెలియజేయడమే కాకుండా తాళ్లపల్లి గ్రామస్తులందరికీ ఓసిపి-2 గని మేనేజర్ సుధీర్, పిట్ సెక్రటరీ కందుల శంకర్ చేతుల మీదుగా గన్ని బ్యాగులు పంపిణీ చేశారు. తాళ్లపల్లి గ్రామ పాఠశాల విద్యార్థులకు పెన్నులు, బిస్కెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓసిపి గని పర్యావరణ అధికారి జలాలుద్దీన్, సంక్షేమ అధికారి బొంగోని శంకర్, సీనియర్ అండర్ మేనేజర్, ఎం.వెంకన్న, సీనియర్ మైనింగ్ సర్దార్ రాజేశ్వర్, సీనియర్ కార్మికులు సత్తయ్య పాల్గొన్నారు.